ప్రజాశక్తి
మంగళవారం 18 జూన్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను అ భినందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పంగులూరు

వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ముప్పవరంలోని టిడిపి కార్యాలయంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రికి టిడిపి కార్యకర్తలు, నాయకులు అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా విద్యుత్ శాఖ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాల వైసిపి పాలనలో ఉమ్మడి ప్రకాశం జిల్లా అభివద్ధికి నోచలేదన్నారు. గుండ్లకమ్మ జలాశయానికి గేట్లు ఏర్పాటు చేయకుండా లక్షలాది ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందకుండా చేశారన్నారు. 2వేల జాలర్ల కుటుంబాలు వీధిన పడ్డాయని తెలిపారు. జిల్లాలో ఉన్న వెలిగొండ,యర్రం చిన్న పోలిరెడ్డి, భవనాసి రిజర్వాయర్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ట్రూ అప్,సర్ ఛార్జీ,ఫిక్సిడ్ చార్జీల పేరిట గత ప్రభుత్వం 9 సార్లు సామాన్యుడిపై మోయలేని భారం మోపిందన్నారు. విద్యుత్ రంగాన్ని నాశనం చేసి రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంత్రి గొట్టిపాటికి ఘనస్వాగతం.

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రవికుమార్ తొలిసారిగా సోమవారం ముప్పవరంలోని టిడిపి కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు రవికుమార్‌ను పూల మాలలు, బొకేలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. తనను కలిసి, అభినందించిన నాయకులు, కార్యకర్తలను పేరుపేరునా పలకరించి, ఆయన కృతజ్ఞతలు ▶ 2లో

జిల్లాలో కీ రోల్ దామచర్లదే..

- జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దామని నేతలకు హితవు
- ఓడిన ఇద్దరికీ, దామచర్ల సత్యకూ నామినేటెడ్ పదవులు ఇప్పించేందుకు కృషి
- పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదిలే ప్రసక్తేలేదని ఎమ్మెల్యే హెచ్చరిక



ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

నిన్నటి వరకూ అన్నీ తానై అందరినీ సమన్వయం చేసుకుంటూ దామచర్ల జనార్ధన్ పార్టీని ముందుకు నడిపించారు. భవిష్యత్‌లోనూ ఆయన జిల్లాలో క్రియాశీలక పాత్రనే పోషించనున్నారు. తన స్వగ్రామం తూర్పునాయుడుపాలెంలో నిర్వహించిన విజయోత్సవ సభలో ఆయన చేసిన ప్రసంగమే ఇందుకు అద్దం పడుతోంది. చాలాకాలం పార్టీ అధ్యక్షుడిగానూ.. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అధికారం లేని కాలంలో, అధికారం ఉన్నపుడూ ఆయన కీలకంగానే పనిచేశారు. పార్టీని కష్టకాలంలో నడిపించారు. కార్యకర్తలకూ భరోసాగా ఉన్నారు. జిల్లా కేంద్రంలో ఉండే నేతలెవరైనా ఇదే పాత్రపోషిస్తారు.ఇపుడు దామచర్ల కూడా ఇదే పంథాలోనే భవిష్యత్‌లోనూ సాగుతామనే స్పష్టత ఇచ్చారు. ఒంగోలు ఎమ్మెల్యేగా జిల్లా కేంద్రంలో మిగతా నియోజకవర్గ ఎమ్మెల్యేలకు అవసరమైన సహకారం అందిస్తూ పెద్దన్నపాత్రను పోషిం చేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారు. ఎన్నికల సమయంలోనూ, పార్టీ కార్యక్రమాల్లోనూ రాష్ట్ర నేతల పర్యటనల్లోనూ ఆయన జిల్లా అంతటా పాల్గొన్నారు. ప్రధాన భూమిక పోషించారు. మిగతా నేతలతో సమన్వయంతో నడిచారు. భవిష్యత్‌లో ఏం చేయాలి?ఎలా ముందుకు పోవాలనే దానిపై ▶ 2లో

కాలువలకు మరమ్మతులేవీ..?

- ఖరీఫ్ సీజన్ ప్రారంభం
- అడపాదడపా వర్షాలు
- పూడిక, గుర్రపుడెక్కతో నిండిన పంట కాలువలు
- నీటి సరఫరాకు ఇక్కట్లు
- చివరి భూముల రైతుల్లో ఆందోళన



కొమ్మమూరు కాలువ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు ఇప్పుడిప్పుడే వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్నారు. అడపా దడపా వర్షాలు కూడా పడుతున్నాయి. మగశిర కార్తెలో వచ్చే మొదటి పౌర్ణమి రోజైన ఈనెల 22న రైతులు ఏరువాక ప్రారంభించనున్నారు. అయినప్పటికీ మాగాణి సాగు ప్రధానమైన పంట కాలువల మరమ్మతుల గురించిన ఊసే లేదు.

గత నాలుగేళ్లుగా పంట కాలువల మంమ్మతుల గురించి పాలకులు పట్టించుకోలేదు. దీంతో మాగాణి భూములకు సక్రమంగా నీరందక రైతులు నష్టపోయారు. కాలువ చివరి భూముల రైతులు సాగు నీటి కోసం యజ్ఞం చేయాల్సి వచ్చింది. గతేడాది పంట కాలువ మరమ్మతుల కోసం అధికారులు అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయినప్పటికీ నిధులు మంజూరు కాలేదు. దీంతో కొమ్మమూరు కాలువ చివరి భూముల రైతులు వరిపంట చేతికి అందే దశలో నీరందక ఇబ్బందులు పడ్డారు. ఆయిల్ ఇంజన్లలతో నీరు పంపింగ్ చేసుకున్నారు. రైతులందరూ కలసి చందాలు వేసి పంట కాలువలకు మరమ్మతులు చేసుకున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు పడకముందే పంట కాలువల మర మ్మతులు చేస్తేనే మాగాణికి సక్రమంగా సాగునీరందుతుంది. కృష్ణా పశ్చిమ డెల్టాలో ఉన్న ప్రధాన కాలువ కొమ్మమూరు. ఈ కాలువ ఉప కాలువల ద్వారా పంట భూములకు నీరు సరఫరా అవుతుంది. కొమ్మూరుకాలువలో పూడిక తీయక తీయలేదు. గుర్రపు డెక్క పెరగడంతో సాగు నీరు దిగువకు రావడం లేదు. బాపట్ల జిల్లాలోని దిగువ పంటపొలాలకు కొమ్మమూరు కాలువ నుంచి నీరు చేరాలంటే కాలువలో నీటిమట్టం సరిపడా ఉంచాలి. కట్టలు పటిష్టంగా లేనందున పూర్తిస్థాయిలో కాలువలో నీటిని విడుదల చేయలేదని దుస్థితి ఉంది. వైసిపి హయాంలో పంట కాలువల మరమ్మతుల కోసం అవసరమైన మేర నిధులు విడుదల చేయలేదు. అడపాదడపా పనులు చేసిన కాంట్రాక్టర్లకు చేసిన పనులకు బిల్లులు మంజూరు కాలేదు. దీంతో కాంట్రాక్టర్లు మరమ్మతుల పనులు చేసేందుకు ముందుకు రాలేదు. రూ 5 లక్షల లోపు పనులను రైతు సంఘాలకు నామినేషన్‌పై ఇచ్చినా బిల్లులు రాక వారు కూడా ఇబ్బందులు పడ్డారు.

జిల్లాలోని పంట భూములకు సక్రమంగా నీరందాలంటే కృష్ణా కాలువ ప్రధానమైంది. ఈ కాలువ ప్రకాశం బ్యారేజీ వద్ద నుంచి ప్రారంభమవుతుంది. అనంతరం 20 కిలోమీటర్ల దూరంలోని దుగ్గిరాల లాకుల వద్ద రెండుగా చీలు తుంది. అందులో ఒకటి కొమ్మమూరు కాలువ , రెండోది నిజాంపట్నం కాలువ. దుగ్గిరాల లాకుల వద్ద ప్రారంభమైన కొమ్మమూరు కాలువ సంగం జాగర్లమూడి, చేబ్రోలు, కొల్లిమర్ల, నర్సాయపాలెం ▶ 2లో



మంత్రి స్వామిని కలిసిన ఎస్‌పి

▶ 8లో

ఇదెక్కడి చోద్యం..!

- రబీ సీజన్ ముగిశాక పంట నష్ట పరిశీలనా..?
- 20న జిల్లాకు కేంద్ర కరువు బృందం రాక



తడిసిన వరి పంట చూపుతున్న రైతు (ఫైల్)

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గత ఏడాది రబీలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు సకాలంలో కురవలేదు. పంటలు పూర్తిగా ఎండిపోయాయి. పశుగ్రాసం కూడా దక్కని దుస్థితి. ఈ పరిస్థితుల్లో 31 మండలాలను కరువు మండలాలుగా గుర్తించారు. రూ. 61 కోట్లు నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వడపోతల అనంతరం 22 మండలాలనే కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. అందుకు గాను రూ. 29 కోట్ల 39 లక్షలు నష్టం జరిగినట్లు ప్రకటించింది. 22 మండలాల్లో 29,713 హెక్టార్లలో శనగ, వరి, ఆముదం, జొన్న, మొక్కజొన్న, కంది, పత్తి, మినుము తదితర పంటలు 36,147 మంది రైతులు నష్టపోయినట్లు తేల్చారు. పెద్దదోర్నాల మండలంలో 1,441 ▶ 2లో

పీర్లమాన్యం అభివృద్ధికి ప్రత్యేక కృషి: ఎంఎల్ఏ బీఎన్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

తెలుగుదేశం పార్టీ పాలనలో పీర్లమాన్యం అభివద్ధికి ప్రత్యేక కషి చేయనున్నట్లు సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్ వెల్లడించారు. మండలంలోని పేర్నమిట్ట పరిధిలోని పీర్ల మాన్యంలో సోమవారం జరిగిన బక్రీద్ వేడుకల్లో భాగంగా స్థానిక టిడిపి నేతలు ఏర్పాటు చేసిన కేకును ఎమ్మెల్యే విజయ్ కుమార్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీర్లమాన్యం అభివృద్ధి కోసం మరింతగా పాటుపడతామన్నారు. పీర్లమాన్యం టిడిపి నాయకులు ఎమ్మెల్యే విజయ్ కుమార్‌కు పూలతో ఘనస్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ముస్లిములకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కందుకూరు వెంకటేశ్వరరావు(బాబు) మాజీ ఎంపీపీ వివరం గోవిందయ్య మాజీ వైస్ ఎంపీపీ వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి, టిడిపి జనసేన నాయకులు షేక్ కాలేషా, షేక్ అమానుల్లా, షేక్ మన్సూర్, పెసల శ్రీనివాసరావు, కందుకూరు వాసు శ్రీనివాసరావు, మలగా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్

జిల్లాలో కీ రోల్ దామచర్లదే..

(మొదటిపేజీ తరువాయి)

ఆయన స్పష్టంగా తన వైకిరిని చెప్పారు. జిల్లా నేతగా ఆయన అందరి బాధ్యతను గుర్తుచేశారు. జనం మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు.అందరం కలిసికట్టుగా పనిచేసి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని మిగతా ఎమ్మెల్యేలకూ సూచించారు. పార్టీకార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.పరోక్షంగా ప్రతిపక్షానికి హెచ్చరికలు చేశారు. చట్టపరంగానే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల తర్వాత కొందరు హైదరాబాదులో వెళ్లి దాక్కున్నారని, ఎప్పటికైనా బయటకు రాకపోతారా? అని హెచ్చరిక జారీచేశారు. ఎవరినుద్దేశించి అన్నారో కూడా స్పష్టత ఉంది. జిల్లాలో మార్కాపురం జిల్లా ఏర్పాటు, కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలు ఒంగోలు జిల్లాలో కలపడం, వెలిగొండ ప్రాజెక్టు లాంటి అంశాలపై అందరూ కలిసి సిఎం చంద్రబాబు వద్దకు వెళ్లి సాధించుకోవాలని సూచించారు. పార్టీ నుంచి ఓడిపోయిన ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మి, కొండపి నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి విజయానికి కీలకపాత్ర పోషించిన దామచర్ల సత్యకు నామినేటెడ్ పదవులు ఇప్పించి వారికి మంచి గౌరవం దక్కేలా అందరమూ చూస్తామని హామీ ఇచ్చారు.దీంతో సభకు హాజరైన కార్యకర్తలు, అభిమానుల నుంచి హర్ష ధ్వనులు వినిపించాయి. పార్టీ పరంగానూ ఇతర ఎమ్మెల్యేలకు ఆయన భవిష్యత్‌లో కీలకపాత్ర పోషించాల్సి ఉంది. మంత్రిగా ఉన్న వీరాంజనేయస్వామి రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ కార్యకలాపాల్లో ఎక్కువగా ఉండాల్సి ఉంటుంది. జిల్లా అభివృద్ధితోపాటు కీలక హామీలు అమలు కోసం దామచర్ల నేతృత్వంలోనే అందరూ నడవాల్సి ఉంటుంది. నడిపించే నేతగా ఇప్పటి వరకూ ఉన్నారు. భవిష్యత్‌లోనూ ఇదే పాత్ర పోషించాల్సి ఉంది. ప్రస్తుతం ఆయన ఒంగోలు ఎమ్మెల్యేగానే కాకుండా జిల్లాలో పార్టీ వ్యవహారాలు కూడా చూడాలని కోరుతున్నారు. సిఎం చంద్రబాబు కూడా ఉమ్మడి ప్రకాశంలో ఇప్పటి వరకూ పార్టీ నేతలుగా ఉన్న దామచర్లతోపాటు గొట్టిపాటి, ఏలూరి సాంబశివరావులకు అన్ని విషయాల్లో అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. అన్నీ వీరితోనే చర్చించాకే నిర్ణయాలు తీసుకున్నారు. ఏదేమైనా జిల్లాలో పాలకపక్షాన్ని శక్తివంతగా నడిపించేపాత్రలో దామచర్ల ఉండాలని కార్యకర్తలు కూడా కోరుకుంటున్నారు. జిల్లాలోని అనేక నియోజక వర్గాల్లో ఇచ్చిన హామీలు కూడా సవాలుగానే భావించకతప్పదు. ఎందుకంటే జిల్లాల పునర్విభజన కీలకంగా ఉంది. వెలుగొండ నిర్వాసితులకు పరిహారాలు పెండింగ్‌లో ఉన్నాయి. నియోజకవర్గాల వారీగా అనేక హామీలు ఇచ్చారు. వాటి అమలుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. భారీ మెజార్టీలతో గెలిపించిన ప్రజల ఆకాంక్షలు అనేకం ఉన్నాయి. వాటిని ఏ మేరకు తీర్చుతారన్నదే చూడాలి.



ఎంపి శ్రీనివాసులరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఎంపీ మాగుంటకు సన్మానం

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలం, ఎం నిడమనూరు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కాకుమాని శ్రీకాంత్, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డిని సోమవారం వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి సత్కరించారు. వీరు ఎం నిడమనూరు గ్రామాభివృద్ధిని గురించి చర్చించారు. వీరి వెంట టంగుటూరు మండల ఐటిడిపి అధ్యక్షులు కాకుమాని శ్రీనివాస్, గ్రామ ప్రధాన కార్యదర్శి పేరాబత్తిన రంగారావు, టిడిపి సీనియరు నాయకులు కొత్తపల్లి వెంకయ్య పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

బాధితులకు బూచేపల్లి భరోసా

ప్రజాశక్తి-దర్శి: దర్శి పట్టణం పొదిలి రోడ్ వున్న పార్టీ నాయకులు కుందూరు నరసింహారెడ్డి ఇంటిపై ఆదివారం రాత్రి నరసరావుపేటకు చెందిన టిడిపి నాయకులు దాడి చేయడంతో జడ్‌పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి బాధితులను పరామర్శించారు. వారు బాధితుల ఇంటికి వెళ్లి పరామర్శించారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. తొలుత లవలపాడు గ్రామ ముస్లిం మత పెద్దలు బక్రీదు పర్వదినాన్ని పురస్కరించుకొని పత్యేక ప్రార్థనలు చేశారు. మంత్రి గొట్టిపాటి ప్రార్థన పాల్గొని వారి దీవెనలను అందుకున్నారు.ఈ కార్యక్రమంలో పంగులూరు, కొరిశపాడు మండలాల టిడిపి అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, జయంతి బాబు , మాజీ జడ్‌పిటిసి కరి వెంకట సుబ్బారావు, డెయిరీ మాజీ చైర్మన్ బాలిన రామ సుబ్బారావు , కుక్క పల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, ఆదిశేకర్, చెన్నుపాటి హరిబాబు, కారుసాల బాబు, సింగమనేని వాసు, మేదరమెట్ల శ్రీనివాసరావు, బో రెడ్డి ఓబుల్ రెడ్డి, అల్లం లేని బ్రహ్మానంద స్వామి, ఎస్‌సి సెల్ నియోజవర్గ అధ్యక్షుడు వలపర్ల సుబ్బారావు, పెండ్యాల రామలింగస్వామి, నార్నె సుబ్బారావు, నార్నె శ్రీకాంత్, రేణింగవరం మాజీ సర్పంచి అమర్తపూడి ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

ఇదెక్కడి చోద్యం

(మొదటిపేజీ తరువాయి)

మంది రైతులకు సంబంధించిన 933 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. రూ. 84,59,65 పంట నష్టం వాటిల్లినట్లు ప్రతిపాదనలు పంపారు.

పంట నష్టం ఇలా...

జిల్లాలోని 22 మండలాల్లో మినుము 8,440 హెక్టార్లు, అలసందలు 3,707 హెక్టార్లు, నువ్వులు 1,460 హెక్టార్లు, జొన్న 2,346 హెక్టార్లు, శనగలు 11,012 హెక్టార్లు, ఆముదం 203 హెక్టార్లు, కంది 62 హెక్టార్లు, మొక్కజొన్న 484 హెక్టార్లు, ఉలవలు 914 హెక్టార్లు కలిపి మొత్తం 29,713 హెక్టార్లలో పంటలు నష్టపోయినట్లు గుర్తించారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

కేంద్ర కరువు బృందం పర్యటన ఇలా..

ఈనెల 20న కేంద్ర బృందం పంట పొలాలను పరిశీలించనుంది. మొదట జిల్లా అధికారులతో కలిసి ఎస్‌హెచ్ మన్సూర్‌జి ఉపాధ్యాయ, ఎస్‌సి కశ్యఫ్, మదన్ మోహన్ మౌర్య, అనురాధ బతాన అనే కేంద్ర కరువు బృందం సభ్యులు ఫొటో ఎగ్జిబిషన్ తిలకిస్తారు. అనంతరం తర్లుపాడు మండలంలోని పోతలపాడు, ఎంఐ ట్యాంకు, గానుగపెంటలో పర్యటిస్తారు. రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. నీటి సమస్యపై ఆరా తీస్తారు. అనంతరం మార్కాపురం మండలం వేములకోటలో పర్యటిస్తారు. ఎంఐ ట్యాంకును సందర్శిస్తారు. పెద్దారవీడు మండలం గొబ్బూరు, పిఆర్ ట్యాంకు పరిశీలిస్తారు. రైతులతో మాట్లాడతారు. మంచినీటి సమస్యను అడిగి తెలుసుకుంటారు. రైతులతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొంటారు. రబీ సీజన్‌లో దెబ్బతిన్న పంటలను ఇప్పుడు పరిశీలిస్తే ఉపయోగం ఏమిటని రైతు సంఘం మార్కాపురం డివిజన్ కార్యదర్శి దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి ప్రశ్నిస్తున్నారు. పంట నష్టం జరిగినప్పుడు రాకుండా ఇప్పుడు వచ్చి రైతులకు ఏమి చేస్తారని ఆయన పేర్కొన్నారు.

కాలువలకు మరమ్మతులేవీ..?

(మొదటి పేజీ తరువాయి)

కారంచేడు మీదుగా చినగంజాం, పెదగంజాం వద్దకు చేరుతుంది.

జిల్లాలో 3.79 లక్షల ఎకరాల ఆయకట్టుకు కాలువల ద్వారా సాగునీరు అందాల్సిఉంది. కాలువల ఎగువ ప్రాంతంలోని భూములు, దిగువ ప్రాంతంలోని ఆయకట్టు చివర భూములన్నింటికీ సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి. అందుకోసం కొమ్మ మూరు కాలువ ఎగువనున్న దుగ్గిరాల లాకుల నుంచి నిజాపంట్నం కాలుష్య, కొమ్మమూరు కాలువలతో పాటు ప్రధానమైన 5 కాలువల ద్వారా ఆయకట్టు భూములకు నీరు చేరాల్సిఉంది. ఇందుకోసం మొత్తం 112 కిలోమీటర్ల మేర పంటకాలువల మరమ్మతులు చేపట్టాల్సిఉంది. అందు కోసం రూ 9.48 కోట్లతో అధికారులు అంచనాలు పంపారు. బాపట్ల జిల్లాలో 66 చోట్ల పంట కాలువలకు మరమ్మతులు చేయాల్సి ఉంది.

జనరల్ బోగీలు పెంచాలి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ప్రతి రైల్లో సాధారణ బోగీల సంఖ్యను పెంచాలని మండలంలోని ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త టి శామ్యూల్ పేర్కొన్నారు. సోమవారం ఉప్పుగుండూరులోని గ్రంథాలయం సెంటరులో విద్యార్థులతో ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శామ్యూల్ మాట్లాడుతూ రైల్లో సాధారణ బోగీలు తక్కువగా ఉండడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతి రైల్లో కనీసం ఐదు బోగీలు పెంచాలని డిమాండ్ చేశారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్

పలుచోట్ల ముస్లిముల ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలో ముస్లిములు సోమవారం భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగను జరుపుకున్నారు. ఉదయం 8:00 గంటలకే యర్రగొండపాలెంలో పాటు పరిసర గ్రామాల ముస్లిం, నూర్‌బాషాలు యర్రగొండపాలెంలోని పెద్ద మసీదు వెనుక గల ఈద్గా దగ్గరకు చేరుకున్నారు. అక్కడ ముస్లిం మతపెద్ద సయ్యద్ మౌలానా మహ్మద్ ఇస్మాయిల్ హిదయతుల్లా బక్రీద్ ప్రత్యేక నమాజులు చదివించారు. బక్రీద్ ప్రాముఖ్యతను వివరించారు. కాలం కలిసి రావాలని, అందరూ ఆయురారోగ్యాలతో జీవించాలని, సకాలంలో వర్షాలు కురవాలని దువా చదివారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. అనంతరం కొందరు ఖుర్బానీలు ఇచ్చారు. ఇండ్లలో బిర్యానీలు, సేమియాలు వండుకొని స్నేహితులకు, బంధువులకు విందులు ఇచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకున్నారు.

పెద్ద దోర్నాల: పెద్దదోర్నాల మండలంలో సోమవారం ముస్లిములు భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగను జరుపుకున్నారు. గ్రామానికి దూరంగా ఉండే ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక నమాజులు చేశారు. ఖుర్బానీలు ఇచ్చుకున్నారు. బిర్యానీలు వండుకొని స్నేహితులకు విందులు ఇచ్చారు.

త్రిపురాంతకం: త్రిపురాంతకం మండలంలో సోమవారం బక్రీద్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక నమాజులు చదివారు. ఖుర్బానీలు ఇచ్చుకున్నారు. బిర్యానీలు వండుకొని సన్నిహితులకు విందులు ఇచ్చారు.

పుల్లలచెరువు: పుల్లలచెరువు మండలంలో సోమవారం బక్రీద్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఖుర్బానీలు ఇచ్చుకున్నారు. బిర్యానీలు వండుకొని సన్నిహితులకు విందులు ఇచ్చారు.

చీమకుర్తి: చీమకుర్తిలో సోమవారం బక్రీదు వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఈద్గాలో వేలాది మంది ముస్లీంలు నమాజు చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త ప్రభోధించిన ప్రపంచ మానవాళి సోదర భావాన్ని, సమైక్యతను అందరూ అనుసరించాలని ముస్లిం పెద్దలు పేర్కొన్నారు. త్యాగానికి, సత్యానికి ప్రతీక బక్రీదు పండుగని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిములకు ఈద్ ముబారక్ తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం యూత్ నాయకులు ఎస్‌కె అహమ్మద్‌బాషా, ఎస్‌కె రఫీ, ఎస్‌కె అపసాలేహ్, ఎస్‌కె షరీఫ్, ఎస్‌కె అరీఫ్, సయ్యద్ రఫీ, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

పొదిలి: బక్రీద్ పర్వదినాన్ని పొదిలిలో ముస్లిములు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఈద్గా ప్రాంగణంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి అన్ని కుల, మతాల వారు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎస్ఐ జి కోటయ్య పోలీస్ సిబ్బందితో బందోబస్తు పర్యవేక్షించారు.



యర్రగొండపాలెంలో బక్రీద్ నమాజులు చేస్తున్న ముస్లిములు

కనిగిరి: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం కనిగిరి పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లిములతో కలిసి కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. త్యాగానికి సహనానికి ప్రత్యేకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని ముస్లిములు జరుపుకోవాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, నాయకులు షేక్ ఫిరోజ్, షేక్ అహ్మద్, తమ్మినేని వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొంతులమ్మ ఆలయంలో పూజలు

కనిగిరి పట్టణంలోని గార్లపేట రోడ్డులో దొంతులమ్మ ఆలయం, దొరువు వద్ద గల శివాలయంలో సోమవారం కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ పండితులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందజేశారు.

గిద్దలూరు: గిద్దలూరు పట్టణంలో బక్రీద్ పర్వదిన వేడుకలు ముస్లిం మైనారిటీ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పట్టణంలోని నంద్యాల రోడ్డు, కొంగలవీడు రోడ్డులలోని ఈద్గాల వద్దకు ఉదయాన్నే వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గిద్దలూరు పట్టణ జామీయా మసీద్ మౌలానా షేక్ అబ్దుల్ హక్ రషాది మాట్లాడుతూ ముస్లింల ప్రధాన పండగలు రెండు కాగా ఒకటి రంజాన్, రెండవది బక్రీద్ అని అన్నారు. ముస్లింలు ఈ బక్రీద్ పండుగను త్యాగానికి ప్రతీకగా నిర్వహించుకుంటారని తెలిపారు. ఇస్లాం క్యాలెండర్‌లోని బక్రీద్ మాసంలో 10వ రోజున ఈ పండగను జరుపుకుంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ దానగుణం, సేవాగుణం అలవర్చుకోవాలని అన్నారు. పండుగ సందర్భంగా ముస్లిములు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ, బంధుమిత్రులతో సంతోషంగా గడిపారు.



కనిగిర ఈద్గాలో ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

బక్రీద్ విశిష్టతలో భాగమైన ఖుర్బానీని చుట్టుపక్కల వారికి దానంగా అందజేశారు.

శింగరాయకొండ: శింగరాయకొండ ఈద్గా మిట్ట వద్ద బక్రీదు పండుగను పురస్కరించుకొని సోమవారం ముస్లిములు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సోమరాజుపల్లి పంచాయతీలోని పకీరుపాలెం, పాకల గ్రామంలో బక్రీదు పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఎస్ఐ టి శ్రీరామ్ ఆధ్వర్యంలో ఈద్గామిట్ట వద్ద పార్థనలు నిర్వహిస్తున్న సమయంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

సిఎస్ పురం: మండలంలో బక్రీద్ వేడుకలను ముస్లిములు ఘనంగా జరుపుకున్నారు. సిఎస్ పురం, డిజి పేట, నల్లమడుగుల, కోవిలంపాడు అరివేముల చెన్నపు నాయునిపల్లి తదితర గ్రామాలలో ముస్లిములు ఈద్గాల వద్ద ప్రార్థనలు జరిపారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పేదలకు అన్నదానం, దానధర్మాలు చేశారు.

యర్రగొండపాలెం: యర్రగొండపాలెం మండలంలోని పలు మసీదులు, ఈద్గాల వద్ద సోమవారం బక్రీద్ సందర్భంగా ఎస్ఐ సుదర్శన ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేటప్పుడు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు విధులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంతనూతలపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ముస్లిములు బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సంతనూతలపాడు సమీపంలోని మైనంపాడు డొంక వద్ద గల ఈద్గా ప్రాంగణంలో వస్తాదు షేక్ ఫిరోజ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిపారు. మైనంపాడు తక్కెళ్లపాడు గుమ్మళంపాడు గురవారెడ్డిపాలెం పేర్నమిట్ట పేర్లమాన్యం తదితర గ్రామాల్లో ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిములు అధిక సంఖ్యలో బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లిములు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



బిఎన్‌కు శుభాంక్షలు తెలుపుతున్న ముస్లిములు

ఎమ్మెల్యే బిఎన్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

బక్రీద్ సందర్భంగా ఒంగోలులోని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ కార్యాలయంలో సోమవారం సంతనూతలపాడు ముస్లిం సంఘ నాయకులు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. సంతనూతలపాడు పంచాయతీ వార్డు మెంబర్ స్థానిక మసీద్ సంఘం ప్రెసిడెంట్ షేక్ నాయబ్ రసూల్, ముస్లిం సంఘ నాయకులు పి మునీర్ ఆధ్వర్యంలో పలువురు ముస్లిం నేతలు ఎమ్మెల్యే బిఎన్ విజయ్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు ట్రాన్స్‌కో లైన్ మెన్ ఎస్‌కే వహబ్ ముస్లిం సంఘ నాయకులు పి నాగూర్ వలి ఎస్‌కే నజీర్ ఎస్కే సైదా మోటార్ సైకిల్ మెకానిక్ కాలేషావలి ఎస్‌కే రఫీ ఎస్కే ఫకూర్, షేక్ కాలేషావలి ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆ హామీలు నీటి మూటలేనా?

జనాభా పెరుగుతున్నా సమస్య పట్టని పాలకులు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలోని విశ్వనాథపురం జూనియర్ కాలేజీ రోడ్డులోని ఒకటో లైన్‌లో దశాబ్దాల కాలంగా సాగర్ మంచినీటి వసతికి నోచుకోక ప్రజలు గుక్కెడు మంచినీటి కోసం అవస్థలు పడుతున్నారు. పొదిలి మేజర్ పంచాయతీగాఉన్న కాలం నుంచి పలు ధపాలుగా ఈ వీధిలోని ప్రజలు అధికారులకు ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా ఆలకించిన వారు లేరని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పొదిలి ప్రాంతానికి సాగర్ మంచినీటి పథకం మంజూరై సుమారు 40 వసంతాలు పూర్తయింది. 1984 మధ్యకాలంలో అప్పట్లో విశ్వనాథపురం పెద్దగా జనాభా లేదు. ఈ కాలంలో జనాభా భారీగా పెరిగింది. అప్పట్లో ఈ వీధిలో అక్కడక్కడ ఉన్న ఇళ్లు ప్రస్తుతం జాగా ఖాళీ లేక బహుళ అంతస్తులకు చేరాయి. సమీపంలో ప్రధాన రహదారి, ఆర్టీసి బస్టాండ్ ఉండటంలో దాదాపు ఇక్కడ ఇళ్లు ఖాళీలు కూడా దొరకవు. నిత్యం వృత్తి, ఉద్యోగ వ్యాపారా లతో బిజీగా ఉండే ప్రజలు దశాబ్ధాలుగా గుక్కెడు మంచినీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. గత 10 సంవత్సరాల కాలంలో తెలుగుదేశం, వైసిపి ప్రభుత్వాలు పాలన చేసినా ఇక్కడి నాయకులు ఈ వీధిపై కనికరం చూపలేదని విమర్శ ఉంది. ఇటీవల ఎన్నికలకు ముందు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కుందూరు నాగార్జునరెడ్డి పైపు లైన్ నిర్మాణానికి హడావిడిగా ఆదేశాలు ఇచ్చారు. చేసిన పనులకు బిల్లులు వస్తాయో రావో అని కలత చెందిన కాంట్రాక్టర్లు పనులు చేపట్టకుండా వదిలేశారు. నగర పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా గుక్కెడు మంచినీరు అందించలేరా అంటూ స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా మరోసారి అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ఈసారైనా తమ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



దశాబ్దాలుగా మంచినీటి పైపులైన్‌లు వేయలేదని చెబుతున్న విశ్వనాథపురం 1వ లైన్ యువకుడు

గురిజేపల్లెలో ఇరువర్గాల ఘర్షణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఒక శుభకార్యం విషయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారి తీసిన సంఘటన యర్రగొండపాలెం మండలంలోని గురిజేపల్లెలో శనివారం రాత్రి జరిగింది. ఎస్సీ కాలనీలో ఒక శుభకార్యం విషయంలో పిలిచినా రాలేదంటూ జరిగిన ఘర్షణలో వైసీపీ, టిడిపి వర్గాలకు చెందిన వినుకొండ మరియబాబు, సామేలు, దావీదు, పెరిక నరసమ్మలు ఘర్షణకు దిగారు. రెండు వర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుదర్శన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫర్నిచర్ ధ్వంసం

ప్రజాశక్తి-పామూరు

మండల పరిధిలోని పడమట కట్ట కిందపల్లి పంచాయతీ పరిధిలో నిర్మించిన హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం కార్యాలయాన్ని తలుపులు పగలగొట్టి లోపల ఉన్న పర్నిచర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. కరెంటు వైర్లను, స్విచ్ బోర్డులు, తీసుకొని వెళ్లారు. టాయిలెట్‌లో ఉన్న లెట్రిన్ బేసిన్‌ను పగలగొట్టి వెళ్లారు. వాటితో పాటు చెత్త సంపద కార్యాలయంలో గోడలను కూల్చివేశారు. ప్రభుత్వ కార్యాలయాలను ధ్వంసం చేయటం వలన ఆ భారం ప్రజలపై పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.

మాజీ ఎంపీటీసీ కోటిరెడ్డి మృతి

ప్రజాశక్తి-దర్శి



గంగిరెడ్డిపాలెం కోటిరెడ్డి (ఫైల్)

మండలంలోని పొతకమూరు మాజీ ఎంపీటీసీ గంగిరెడ్డిపాలెం కోటిరెడ్డి(80) సోమవారం వయోభారంతో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు అమ్మాయిలు, ఒక కుమారుడు సంతానం. కుమారుడు జి యల్లమందా రెడ్డి, ప్రస్తుతం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా సేవాదళ్ కార్యదర్శిగా పని చేస్తున్నారు. కోటిరెడ్డి మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. నేడు స్వగ్రామం బొట్లపాలెంలో అంత్యక్రియలు జరుగుతాయని కుమారుడు యల్లమందారెడ్డి తెలిపారు. ఆయన 2001 నుంచి 2006 వరకు పొతకమూరు ఎంపీటీసీగా పని చేశారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-దర్శి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులుగా బల్లా శ్రీనివాస్ యాదవ్ ఎన్నికైన సందర్భంగా టిడిపి దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్ర రాష్ట్రంలో సిఎం నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో శ్రీనివాసయాదవ్ సారథ్యంలో దర్శి నియోజకవర్గంలో పార్టీ ప్రతిష్టకు కట్టుబడి పని చేస్తానన్నారు. అదే విధంగా దర్శి నియోజకవర్గం అభివృద్ధికి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు.



బధిర విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న మద్దాళి మాధవరావు

బధిరులకు విద్యా సామగ్రి అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి: స్థానిక ఎస్‌కెఆర్ బధిరుల పాఠశాల విద్యార్థులకు అభయ కళారాధన ఫౌండేషన్ అధ్యక్షులు మద్దాళి మాధవరావు నోటు పుస్తకాలు, పలకలు అందజేశారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ కుమారుడు కీర్తిశేషులు మద్దాళి పవన్‌కుమార్ పేరు మీదుగా బధిరుల పాఠశాలకు నోటుపుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసి అధికారి పరాంకుశం శ్రీనివాస మూర్తి, టెలికం అధికారి సీతాపతిరావు, మెప్మా అధికారి చిరంజీవి, ప్రిన్సిపాల్ ఎస్ అంజిరెడ్డి, వద్ది నరసింహా రావు, ఉపాధ్యాయులు లక్ష్మణబాబు, సుబ్బారెడ్డి, పద్మావతి, సుశీల, పావని, బాలగంగాధరరావు పాల్గొన్నారు.

నేడు మోటూరి 23వ వర్ధంతి సభ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరు గ్రామంలో జన్మించిన ప్రజాశక్తి సంపాదకులు, మార్క్సిస్టు నేత కామ్రేడ్ మోటూరి హనుమంతరావు 23వ వర్ధంతిని ఆయన విగ్రహం వద్ద నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్ తెలిపారు. 1917లో వెల్లటూరులో జన్మించిన ఆయన విద్యార్థి దశ నుండే ప్రజా సమస్యలపై పోరాడుతూ అంచలంచెలుగా ఎదిగి రాజ్యసభ సభ్యునిగా పని చేశారని అన్నారు. ఆయన 10ఏళ్లపాటు విశాలాంధ్ర దిన పత్రికకు సంపాదకునిగా, మరో 15ఏళ్లపాటు ప్రజాశక్తి సంపాదకులుగా పనిచేశారని అన్నారు. 1948లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యునిగా పని చేశారని అన్నారు. 1952లో రేపల్లె శాసన సభ్యునిగా ఎన్నికై ఉమ్మడి మద్రాసు శాసన సభలో కొనసాగారని అన్నారు. 1953లో శాసనసభ ఉప నాయకునిగా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. 1978లో శాసన మండలి సభ్యునిగా ఎన్నికై 1984వరకు పనిచేశారని తెలిపారు. 1988 నుండి 1994 వరకు రాజ్యసభ సభ్యునిగా సేవలు అందించారని అన్నారు. వెల్లటూరు, రేపల్లె ప్రాంతంలో కూలి రేట్లపై పోరాడారని, లంక భూముల పోరాటంలో ముందుండి నడిపించారని అన్నారు.


వెల్లటూరులో మోటూరు హనుమంతరావు విగ్రహం

ఆనాటి సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ పమిడి ముక్కల లక్ష్మణరావు స్ఫూర్తితో ఈ ప్రాంతంలో అనేక పోరాటాలు నిర్వహించారని అన్నారు. తుది శ్వాస వరకు సిపిఎం జాతీయ నాయకునిగా సేవలు కొనసాగించారని అన్నారు. రైతు కుటుంబంలో జన్మించిన మోటూరు హనుమంతరావు ఉదయం ను వివాహం చేసుకొనగా ఆయనకు ముగ్గురు కుమార్తెలు జన్మించారని తెలిపారు. ఈ ప్రాంతంలో అనేక మంది కమ్యూనిస్టులు జాతీయ నాయకులుగా ఎదిగి రాష్ట్రంలో కీలకమైన వ్యక్తుల్లో మోటూరు ఒకరని అన్నారు. మోటూరు జ్ఞాపకార్థం స్వగ్రామం వెల్లటూరులో సిపిఎం రేపల్లె కమిటీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి వర్ధంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు కృష్ణమోహన్ తెలిపారు. నేడు ఉదయం 9 గంటలకు వర్ధంతి సభ జరుగుతుందని, సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

కూలి డబ్బు ఇవ్వకపోతే ఆందోళన తప్పదు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్

ప్రజాశక్తి - బాపట్ల

జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద పనిచేసిన కూలీలకు కూలి డబ్బులు విడుదల చేయకపోతే జిల్లా ఉపాధి హామీ పథకం పిడి కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్ హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని నరసాయపాలెం, కంకటపాలెం గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నామని తెలిపారు. కూలీలు అనేక సమస్యలను తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. 5వారాల నుండి ఉపాధి కూలీ డబ్బులు రావడంలేదని అన్నారు. తక్షణమే జిల్లా అధికారులు స్పందించి కూలీలకు డబ్బు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో జిల్లా డ్వామా పిడి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో 15రోజుల్లోపు కూలీ డబ్బులు ఇవ్వాలని నిబంధన ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఏడాదికి 200 రోజులు పని చూపించాలని కొరారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని క్రమేపి తీసివేయాలని చూస్తుందని అన్నారు. ఈ పనిని తీసేస్తే వ్యవసాయ కూలీలు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధి హామీ కూలీలపై ఉందన్నారు. వచ్చే బడ్జెట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. చెల్లించాల్సిన బకాయిలు వెంటనే ఇవ్వాలని కోరారు. కనీస వేతనం రూ.6వందలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ మేట్లు రెడ్డి తిరుపతమ్మ, సుబ్బారావు, సుధాకర్, శీను, సాంబయ్య పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న టి కృష్ణమోహన్

మంత్రి 'అనగాని'కి ఘన స్వాగతం

ప్రజాశక్తి - రేపల్లె

రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి మొట్ట మొదటిసారి పట్టణానికి విచ్చేసిన 'అనగాని సత్యప్రసాద్'కు కూటమి శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు సోమవారం సాయంత్రం అపూర్వ ఘన స్వాగతం పలికారు. పెనుమూడి చెక్ పోస్టు ర్యాలీగా ఓల్డ్‌టౌన్ అంకమ్మ చెట్టు, రింగ్ రోడ్ మీదుగా కృష్ణ టాకీస్, తాలూకా ఆఫీస్, రైల్వే స్టేషన్ వద్దగల ఎన్టీఆర్ సర్కిల్ వరకు సాగింది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాల వేసి మంత్రి అనగాని సత్యప్రసాద్ నివాళి అర్పించారు. అక్కడి నుండి మున్సిపల్ ఆఫీస్, బస్టాండ్, లక్ష్మీ టాకీస్ సెంటర్ మీదుగా టిడిపి కార్యాలయానికి ర్యాలీగా చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో కూటమి శ్రేణులు స్వాగతం పలికారు. టాపు లేని జీబుపై నుండి మంత్రి సత్యప్రసాద్ ప్రజలకు అభివాదాలు చేశారు. మహిళలు హారతులు పడుతూ స్వాగతం పలికారు. అనగాని, చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. జనసేన, బిజెపి, టిడిపి ఉమ్మడి జెండాలు ద్విచక్ర వాహనాలపై పెట్టుకుని ర్యాలీ టిడిపి కార్యాలయం వరకు సాగింది. పూల దండలు, శాలువాలతో సత్కరించారు.


విక్టరీ సింబల్ చూపుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేయాలి

ప్రజాశక్తి - బాపట్ల

ప్రభుత్వ ఉద్యోగుల చిత్తశుద్ధితో పనిచేసి మెరుగైన సేవలు అందించాలని ఎంఎల్‌ఎ వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ఎపి గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు ఆయనను తన ఇంటి వద్ద మర్యాద పూర్వకంగా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందే విధంగా చూడాలని అన్నారు. సొంత నిర్ణయాలతో ప్రజలను ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదని అన్నారు. ప్రభుత్వంపై ఎన్నో ఆశలతో అత్యధిక మెజారిటీతో రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వాన్ని ప్రజలు బలపర్చారని అన్నారు. మునిపెన్నడూ లేని విధంగా బాపట్లలో అత్యధిక మెజారిటీతో తనకు విజయం చేకూర్చారని అన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె రోశయ్య, కార్య దర్శి పి శ్రీనివాసరావు, పి అమ్మయ్య, బేనర్జి, ఉదయ్ గోపి, రత్నకూమరి, రమణమ్మ, రాంబాబు, సుబ్బరావు పాల్గొన్నారు.


నరేంద్రవర్మను కలిసిన ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు


మంత్రి రవి కుమార్‌తో ఎంఆర్‌పిఎస్ నాయకులు

మంత్రి గొట్టిపాటిని కలిసిన ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి - చీరాల

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహజన సోషలిస్టు పార్టీ ప్రతినిధులు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను సోమవారం కలిశారు. ముప్పవరం క్యాంపు కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. పూల మాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎంఆర్‌పిఎస్ అనుబంధ శ్రేణులన్ని గొట్టిపాటి విజయానికి పూర్తి స్థాయిలో పనిచేసినట్లు తెలిపారు. తెలుగుదేశం గెలుపులో భాగస్వామ్యమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు బుడంగుంట్ల లక్ష్మీ నరసయ్య మాదిగ, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు దుడ్డు వందనం మాదిగ, ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు వంగెవరపు రమేష్, మంద ఆమోస్, పునూరి నరేంద్ర, పల్లెపోగు నాని, మారుతి ప్రసాదు, తేళ్ళ శ్రీనివాసరావు, మహేంద్ర, పేతురు, పునూరి రమేష్, రాము, ఎలీషా, అబ్రహాం, ప్రతాప్ పాల్గొన్నారు.


మంత్రి గొట్టిపాటిని సత్కరిస్తున్న శింగరకొండ అర్చకులు

మంత్రి గొట్టిపాటికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - అద్దంకి

విద్యుత్ శాఖ మాత్యులు గొట్టిపాటి రవికుమార్‌ను ఆయన నివాసంలో ఏపి ఎస్‌పిడిసిఎల్ సిఎండీ సంతోష రావు తన సిబ్బందితో కలిశారు. మంత్రికి అభినందనలు తెలిపారు. శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన ఈఓ, వేద పండితులు ఆసీర్వచనాలు అందించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

బక్రీద్ వేడుకల్లో ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

బక్రీద్ పండుగ సందర్భంగా స్థానిక నవాబ్ పేటలోని ఈద్గా ప్రార్థనల వద్ద శాసన సభ్యులు మద్దులూరి మాల కొండయ్య ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. ప్రార్థన అనంతరం మత పెద్దలు ప్రార్థన సమయంన అసౌకర్యానికి గురౌతున్నామని, టెంట్లు వేసుకోవాల్సి వస్తున్నదని ఆయన దృష్టికి తెచ్చారు. ఖర్చులవుతున్నాయని తెలిపారు. తక్షణమే రూ.25వేల సహాయంను ఎంఎల్‌ఎ కొండయ్య అందించారు. ముస్లిం మత పెద్దలు ఈద్గా ప్రార్థనా మందిరంను ఎన్నో సంవత్సరాలుగా అసౌకర్యాలుగా ఉన్నా ప్రార్థనలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ స్థలమునకు పర్మినెంట్ నీడ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఎంఎల్‌ఎను కోరారు. తన పదవీ కాలంలో ఈ ప్రాంతానికి షెడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తానని, మంచి సాంకేతికతతో నీడ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.


ఆనంద్ బాబులు కలిసిన లంక గ్రామాల నాయకులు

ఆనందబాబుకు సత్కారం

ప్రజాశక్తి - కొల్లూరు

సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బిజెపి అభ్యర్థిగా నక్క ఆనందబాబు అత్యధిక మెజార్టీతో గెలిచిన సందర్భంగా ఆయనను తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనకాల మధుసూదన్ ప్రసాద్, మండలంలోని లంక గ్రామాల జనసేన, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. శాలువాతో సత్కరించారు.

వేమూరు : శాసన సభ్యులు నక్క ఆనందబాబును లంక గ్రామాల టిడిపి, జనసేన నాయకులు ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కనగాల మధుసూదన ప్రసాద్ ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. వైసిపి పాలనలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. దీని దృష్ట్యా టిడిపి గెలుపు కోసం అహర్నిశలు కృషిచేసి లంక గ్రామాల నుండి అత్యధిక మెజారిటీ అందించామని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించలని కోరారు. ఆగిపోయిన పనులు, అస్తవ్యస్తంగా ఉన్న పాలనను ప్రక్షాళన చేసి అభివృద్ధి చేస్తానని ఆనందబాబు భరోసా ఇచ్చారు.


ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గం

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - బాపట్ల

ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక టౌన్ హాల్లో సోమవారం నిర్వహించారు. నూతనంగా ఏర్పడిన అసోసియేషన్లో బాపట్ల పట్టణ, మండలంలోని గ్రామీణ ఫోటోగ్రాఫర్లను అసోసియేషన్లో సభ్యులుగా చేర్చుకున్నారు. కొత్తగా ఏర్పడిన అసోసియేషన్ పేరును భావపురి ఫోటోగ్రాఫర్స్ ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్‌గా నిర్ణయించినట్లు అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు వాహిని ప్రసాద్ తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షులుగా పివిఎస్ నాగరాజు, ఉపాధ్యక్షులు సిదార్ధరెడ్డి, కార్యదర్శి ఆదిశేషు, సహాయ కార్యదర్శి ఎస్‌కె జాని, కోశాధికారి నాగేశ్వరావు, ఎన్ శ్రీనివాసరావును ఎన్నుకోవటం జరిగిందని వాహిని ప్రసాద్ తెలిపారు.

నోటీసు ఇచ్చినా ఫలితమేదీ?

ఆక్రమిత భూమిలో కొనసాగుతున్న కట్టడాలు

ప్రజాశక్తి-మార్కాపురం

ఆక్రమణదారుడు బలవంతుడైతే... అధికారులు మెతక వైఖరి అవలంబిస్తుంటారనేది సత్యం.. మార్కాపురంలో కూడా అదే జరుగుతోంది. రూ.కోట్ల ఖరీదు గల దేవదాయ శాఖ భూమిని ఆక్రమించడమే కాకుండా... అందులో అక్రమ కట్టడాలు కూడా ప్రారంభించాడు ఓ ఘనుడు.. ఆక్రమిత భూమి లో అక్రమ కట్టడాలు చేపట్టడాన్ని అధికారులు తప్పు బట్టారు. ఆక్రమణదారుడికి రెవెన్యూ శాఖ అధికారులు నోటీసులు ఇచ్చినా ఫలితం శూన్యం. ఆక్రమిత భూమిలో యథేచ్ఛగా కట్టడాలు కొనసాగుతున్నాయి.



కొనసాగుతున్న అక్రమ కట్టడం నిర్మాణం

మార్కాపురం పట్టణంలో ప్రసిద్ధిగాంచిన శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానానికి సంబంధించిన భూమి పట్టణ పరిధిలో ఉంది. సర్వే నెంబరు 206/బిలో 3 ఎకరాల 75 సెంట్ల విస్తీర్ణం కలిగిన భూమి ఉంది. ఈ భూమి మార్కాపురం పట్టణంలో అత్యంత ఖరీదైన వాటిలో ఒకటిగా ఉంది. వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో జాతీయ రహదారి-565 ఆనుకుని ఉంది. జాతీయ రహదారి ఆనుకుని ఉండటంతో ఆ ప్రాంతం అంతా వ్యాపార సముదాయంగా మారుతోంది. జాతీయ రహదారి ఆనుకుని చదరపు గజం స్థలం విలువ రూ.30 వేలకు పైగా ధర పలుకుతోంది. పైన పేర్కొన్న సర్వే నెంబరులోని భూమి తక్కువలో తక్కువన్నా రూ.50 కోట్ల పైమాటే.. ఇంతటి ఖరీదైన భూమిని అప్పనంగా ఓ ఘనుడు కొట్టేయడంపై గత నెల 20వ తేదీన ప్రజాశక్తి మినీలో 'దేవుడికే శఠగోపం' శీర్షికతో కథనం వెలువడింది. దీనిపై దేవదాయ శాఖతో పాటు రెవెన్యూ శాఖ అధికారులు స్పందించారు. గత నెల 25వ తేదీన ఆక్రమణదారుడికి హెచ్చరిక నోటీసును మార్కాపురం తహశీల్దారు జారీ చేశారు. ఆక్రమిత స్థలంలో కట్టడాలు చేపట్టరాదని, కట్టడాలు కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నోటీసు జారీ చేసి 20 రోజులు దాటినా... ఏ ఒక్క రోజూ అక్కడ నిర్మాణ పనులు ఆగలేదు. ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయలేదు. నేటికీ నిర్మాణ పనులు జరుగుతూనే ఉన్నాయి. పైన పేర్కొన్న భూమి మున్సిపాలిటీ పరిధిలో ఉంది. ఎలాంటి కట్టడం చేపట్టాలన్నా టౌన్ ప్లానింగ్ అనుమతి తప్పనిసరి. కానీ ఇక్కడ అలాంటిదేమీ లేదు. కనీసం మున్సిపల్ అధికారులు కూడా అక్రమ కట్టడాలను పట్టించుకోవడం లేదనే విమర్శ లేకపోలేదు.! పట్టపగలే జరుగుతున్న ఆక్రమణలను ఎవ్వరూ ఆపలేరా అంటూ జనం చర్చించుకుంటున్నారు.



అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

'ముత్తుముల'కు ఆర్య వైశ్యుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు టీడీపీ అభ్యర్థిగా ఘన విజయం సాధించిన ముత్తుముల అశోక్‌రెడ్డికి గిద్దలూరు పట్టణ ఆర్యవైశ్యులు శుభాకాంక్షలు తెలిపి, శాలువా, పూలమాలలతో సన్మానించారు. వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు అండగా వుంటూ వారి తోడ్పాటును అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సూరే వంశావళి ప్రెసిడెంట్ సూరే నాగేశ్వరరావు, వాసవీ క్లబ్ రీజనల్ చైర్మన్ గర్రె పుల్లయ్య, వాసవి వాకర్స్ బ్యాచ్ మాజీ ప్రెసిడెంట్ సూరే రామచంద్రుడు, చీతిరాల రవీంద్రకుమార్, కొప్పరపు ప్రసాదు, తుమ్మలపెంట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ రోడ్డును సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కనిగిరి



ఆదర్శ పాఠశాల విద్యార్థుల సమస్యలను ఎమ్మెల్యే ఉగ్రకు వివరిస్తున్న ఎస్ఎంసి చైర్మన్ బాలచెన్నారావు

కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సోమవారం సాయంత్రం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో గార్లపేట రోడ్డులోని ఆదర్శ పాఠశాలకు వెళ్లే మట్టి రోడ్డును, పాఠశాలను సందర్శించారు. అధ్వానంగా ఉన్న మోడల్ స్కూల్ రోడ్డును తారు రోడ్డుగా మార్చేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్అండ్‌బి అధికారులను పిలిపించి ఆదేశించారు. వర్షాలు వస్తే విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు ఇబ్బంది పడతారని, ఈలోపు అధ్వానంగా ఉన్న మట్టి రోడ్డును మెటల్ రోడ్డుగా నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆదర్శ పాఠశాలను, వసతి గృహాన్ని పరిశీలించి పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సర్వశిక్ష అభియాన్ అధికారులను సంప్రదించి ప్రతిపాదనలు తయారు చేయించాలని పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ గోపిశెట్టి బాలచెన్నారావుకు సూచించారు. అనంతరం గార్లపేట రోడ్డు నుంచి శంఖవరం మీదుగా కందుకూరు ఉన్న రోడ్డును ఆయన పరిశీలించారు. శంకవరంలో గ్రామస్తులతో మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతానని వారికి ఎమ్మెల్యే డాక్టర్ తెలియజేశారు. ఆయన వెంట కనిగిరి పట్టణ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు షేక్ ఫిరోజ్, నాయకులు తమ్మినేని వెంకట్‌రెడ్డి, షేక్ అహ్మద్, షేక్ బారాయిమామ్, తమ్మినేని సురేంద్ర, శ్రీను, కొండలు, నాగ, ఆర్అండ్‌బి ఏఈ ఫిరోజ్ తదితరులు ఉన్నారు.

టిడిపి కార్యకర్తల పాదయాత్ర

ప్రజాశక్తి-కొనకనమిట్ల

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు మరియు మార్కాపురం శాసనసభ్యులుగా కందుల నారాయణరెడ్డి ఘనవిజయం సాధించాలని కోరుతూ తిరుపతి వెంకటేశ్వరుడికి మొక్కుబడి నేపథ్యంలో మండలంలోని నాగరాజుకుంట గ్రామానికి చెందిన పదిమంది తెలుగుదేశం కార్యకర్తలు తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. తమ మొక్కును చెల్లించేందుకు కాలినడకన వెళుతున్న కార్యకర్తలను మార్గమధ్యంలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి వద్ద మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి కలిసి కుశల ప్రశ్నలు వేసి ప్రశంసించారు. తన గెలుపునకు కృషి చేసిన కార్యకర్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి కుందూరు కాశిరెడ్డి తదితరులు ఉన్నారు.



బూచేపల్లి కమలాకరరెడ్డికి నివాళి అర్పిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి

బూచేపల్లి కమలాకరరెడ్డికి నివాళి

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రముఖ సినీ హీరో దివంగత బూచేపల్లి కమలాకరరెడ్డికి ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం బూచేపల్లి కమలాకరరెడ్డి జయంతి సందర్భంగా స్థానిక కమలాకరరెడ్డి పార్కులోని స్మృతివనంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొని ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో దర్శి నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో బూచేపల్లి అభిమానులు తరలివచ్చి నివాళి అర్పించారు. కార్యక్రమంలో చీమకుర్తి ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, మండల వైసిపి అధ్యక్షులు పమిడి వెంకటరావు, నాయకులు మన్న శ్రీధర్, కూడల మాలకొండయ్య, ఏ రామబ్రహ్మం, సూది శ్రీనివాసరావు, బెల్లం వెంకటరావు, అభిమానులు పాల్గొన్నారు.

నల్లమలలో ప్లాస్టిక్ వస్తువులు నిషేధం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల



ఆర్టీసీ సిబ్బందికి నోటీసు అందజేస్తున్న అటవీ సిబ్బంది

నల్లమలలో ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్లు దోర్నాల ఎఫ్ఆర్వో విశ్వేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దోర్నాల నుంచి శ్రీశైలం వరకు ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా ప్రకటించి పలురకాల పర్యావరణహిత కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. ప్లాస్టిక్ నిషేధించేందుకు కఠిన నిబంధనలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పర్యాటకులు ప్లాస్టిక్ వస్తువులను, వాటర్ బాటిళ్లను ఎక్కడి పడితే అక్కడ రోడ్లపై వదిలేయడం వలన అటవీ జంతువులు వాటిని తినడంతో జీర్ణకోశ సమస్యలు వచ్చి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అందుకే ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పర్యాటకులు ప్లాస్టిక్ కవర్లు, ఇతర తినుబండారాల కవర్లను వదిలి వెళ్తున్నారన్నారు. వాటిని నిత్యం ఒక దగ్గరకు చేర్చేందుకు సిబ్బందిని నియమించామని చెప్పారు. ఈ వ్యర్థాలను ప్లాస్టిక్ రీ సైక్లింగ్ కేంద్రానికి చేరుస్తామని అన్నారు. ప్రయాణికులు, భక్తులు కూడా సహకరించాలని కోరారు. అనంతరం ఆర్టీసి సిబ్బందిని అటవీ శాఖ సిబ్బంది నోటీసులు జారీ చేశారు.

మంత్రి స్వామి, ఎంపీ మాగుంటను కలిసిన కనిగిరి టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-కనిగిరి



స్వామిని కలిసిన టిడిపి నాయకులు

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ బాల వీరాంజనేయ స్వామిని, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డిని సోమవారం కనిగిరి టిడిపి శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా పూలమాలతో సత్కరించారు. వెనుకబడిన కనిగిరి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని వారు కోరగా సానుకూలంగా స్పందించారు. మంత్రి ఎంపీని కలిసిన వారిలో టిడిపి జిల్లా నాయకులు ముచ్చుమారి చెంచిరెడ్డి, మాజీ ఎంపీపీలు బేరి పుల్లారెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ మాలపాటి ఓబుల్ రెడ్డి తదితరులు ఉన్నారు.



ఎంపీ మాగుంటను కలిసిన టిడిపి నాయకులు

గ్రామ పంచాయతీ ఆపరేటర్లకు

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-కొండపి



మంత్రి స్వామికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామ పంచాయతీ ఆపరేటర్లు

ఆంధ్రప్రదేశ్‌లో గత 10 నుంచి 20 సంవత్సరాలుగా 1,800 మంది సాంకేతికంగా శిక్షణ పొంది కంప్యూటర్ ఆపరేటర్లుగా గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న సిబ్బందికి మినిమమ్ టైమ్ స్కేల్ పద్ధతి ద్వారా ఉద్యోగ భద్రత కల్పించాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామికి గ్రామ పంచాయతీ ఆపరేటర్లు కోరారు. సోమవారం తూర్పునాయుడు పాలెంలోని ఆయన స్వగృహంలో గ్రామ పంచాయతీ ఆపరేటర్లు వినతిపత్రం మంత్రి స్వామికి అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ బిల్లు కలెక్టర్ పోస్టులు టైమ్ స్కేల్ ప్రకారం విద్య అర్హత ప్రాధాన్యతతో ఇప్పించాలని, గ్రామ పంచాయతీల్లో కేవలం రూ.15 వేలు జీతం పొందుతూ పిల్లల చదువులు, కుటుంబ ఖర్చులతో ఆర్థికంగా ఇబ్బంది పడుతూ కుటుంబ జీవనోపాధిని పోషించుకొనేందుకు కష్ట సాధ్యంగా ఉన్నదని మంత్రికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లను టిడిపి ప్రభుత్వంలో నియమించడం, జీతాలు పెంచడం జరిగిందే తప్ప గత ప్రభుత్వం వారు తమకు బదులుగా డిజిటల్ అసిస్టెంట్ గ్రేడ్-6 తీసుకొని తమకు తీవ్ర అన్యాయం చేశారని అన్నారు. మా వినతిపత్రం చూసి మాకు తగు న్యాయం చేయాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

నల్లమల అడవిలోకి వన్యప్రాణులు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల



అడవిలో వదిలిన జింకలు

కాకినాడలోని నాగార్జున ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో పెంచుతున్న 25 చుక్కల దుప్పులు, 28 కణుతులను ఆదివారం రాత్రి అటవీ శాఖ సిబ్బంది ఆరీఫ్‌ఖాన్ ఆధ్వర్యంలో పెద్దదోర్నాల మండలంలోని చట్లగుండం, పెద్దచెరువు, పచ్చర్ల ప్రాంతాలలో వీటిని వదిలారు. ఈ సందర్భంగా మార్కాపురం డిఎఫ్‌వో విఘ్నేష్ అప్పావు మాట్లాడుతూ మూడు ఎకరాల విస్తీర్ణంలో చుట్టూ కంచె వేసి అందులో వీటిని పెంచనున్నట్లు తెలిపారు. కొంతకాలం తర్వాత దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో వీటిని వదిలేస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో 80 పెద్ద పులులు ఉన్నాయన్నారు. అడవిని, అటవీ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ డిఎఫ్‌వో ఆత్మకూరు వేణు, ఐఎఫ్ఎస్ ట్రైనింగ్ అధికారి శివకుమార్ గంగల్, ఎఫ్ఆర్వో విశ్వేశ్వరరావు, ఆరీఫ్ ఖాన్, అటవీ సిబ్బంది ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



బాపట్ల జమీందారుపేట ఈద్గాలో ప్రార్ధనలు

ప్రజాశక్తి - బాపట్ల

బక్రీద్ పండుగను పట్టణంలో ముస్లిం సోదరులు అత్యంత ఆనందోత్సాహాలతో సోమవారం జరుపుకున్నారు. పట్టణంలోని ఇస్లాంపేట, జమీదార్ పేట ఈద్గాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. బక్రీద్ పండుగ విశిష్టత, ప్రాశస్త్యాన్ని ఇమామ్‌లు వివరించారు. అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో ఈద్గాల్లో ప్రార్ధనలకు టెంట్లు వేసి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. హిందూ, ముస్లిం సోదరులు పరస్పరం ఈద్ ముబారక్, బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అద్దంకి : పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ముస్లిం సోదరులు బక్రీద్ పండుగ భక్తిశ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు, చిన్నారులు, యువకులు భారీ సంఖ్యలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం మత బోధకులు మాట్లాడుతూ స్వార్ధం, అసూయ, రాగద్వేషాలు లేని త్యాగనిరతిని వ్యాప్తి చేయడమే బక్రీదు పండుగ ఉద్దేశమని చెప్పారు. అన్ని గుణాలకంటే దానుగుణమే ఉత్తమమైనదనే సందేశాన్ని ఇచ్చారు. మనమంతా మంచి మార్గంలో నడిస్తే కుటుంబం సంతోషంగా ఉంటుందని అన్నారు. మనకున్న దానిలో సోదరులకు సహకారాలు అందించాలని కోరారు. మణికేశ్వరంలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్ధన లు అనంతరం చిన్నారులు ఒకరి నొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



అద్దంకి : ఆలింగనం చేసుకున్న చిన్నారులు

పర్చూరు : బక్రీద్ పండుగ దానగుణానికి ప్రతీకని మసీదు పేష్ ఇమామ్ షేక్ షాహిద్ రజాక్ అన్నారు. పర్చూరు, ఉప్పుటూరు, నాగుల పాలెం, నూతలపాడు, చెరుకూరు, విరన్నపాలెం తదితర గ్రామాల్లో ముస్లిం సోదరులు నూతన వస్త్రాలు ధరించి బక్రీద్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. ఈద్గాలు, మార్కెట్ యార్డుల్లో అందరూ ఒకే చోట సామూహిక ప్రార్ధనలు చేశారు. మహిళలు ఇళ్ల వద్దనే ప్రార్ధనలు చేశారు. ప్రార్ధనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని సోదర భావాన్ని చాటుకున్నారు. ఈసందర్భంగా పేష్ ఇమాం మాట్లాడుతూ ద్వేషాలు వీడి ప్రేమను పంచాలని అన్నారు. పలువురు ముస్లిం సోదరు లు ఖుర్బానీని సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మసీదు ప్రెసిడెంట్ షేక్ ఆహమద్ బాష, ముతవల్లి నబి, మత పెద్దలు షేక్ ఖాజావలి, షేక్ కాలేష, షేక్ మాబు సుభాని, షేక్ ఫక్రుద్దీన్ అలీ ఆహమద్, షేక్ బుల్లా మెస్త్రీ, షేక్ గౌస్, షేక్ శంషుద్దీన్, పఠాన్ అమీన్, షేక్ బాష, పఠాన్ సమీర్, షేక్ ఫజల్, షేక్ బషీర్ పాల్గొన్నారు.

ముండ్లమూరు : ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రేమ, దయ, త్యాగం, పేదవారికి దాన ధర్మాల చేయడం బక్రీద్ పండుగ ఉద్దేశమని ముస్లిం సోదరులు అన్నారు. మండలంలోని పులిపాడు, ఉల్లగల్లు, పసుపుగల్లు, ముండ్లమూరు, శంకరాపురం, మారెళ్ళ, ఉమామహేశ్వ రపురం, నాయుడుపాలెం, ఈదర గ్రామాల్లోని మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్ధన చేశారు. స్వార్ధం, అసూయ, రాగద్వేషాలు విడిచిపెట్టి మానవుల్లో మంచిని వ్యాపింప చేయడమే బక్రీద్ ఉద్దేశమని అన్నారు. పండగకు కుర్బానీ పేదలకు ఆహారం అందజేసి హజరత్ ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకున్నారు.

సంతమాగులూరు : మండలంలోని కొమ్మాలపాడు, ఏల్చూరు, సంతమాగులూరు, వెల్లలచెరువు గ్రామాల్లోని ముస్లింలు ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్ద భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని వివిధ పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త బోధనలు అందరికి అనుసరణీయమని అన్నారు. అనంతరం మసీదుల వద్ద పేదలకు దానధర్మాలు చేశారు.



ముండ్లమూరులో భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్ధనలు



పర్చూరులో ప్రార్ధనలు చేస్తున్న ముస్లింలు



కొమ్మాలపాడు మసీదులో ముస్లింల ప్రత్యేక ప్రార్ధనలు



గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

మంత్రి గొట్టిపాటికి పోలీసు గౌరవ వందనం

ప్రజాశక్తి - అద్దంకి

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు చిలకలూరిపేటలోని ఆయన నివాసం వద్ద పోలీసులు సోమవారం గౌరవ వందనం చేశారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ పోలీసులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని చెప్పారు. ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు ఉన్నత అధికారులు, సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అవార్డులు అందుకుంటున్న పర్చూరు రోటరీ ప్రతినిధులు

రోటరీ క్లబ్‌కు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ జిల్లా కాన్ఫరెన్స్, అవార్డ్స్ ఫంక్షన్ భద్రాచలంలోని సీతారామ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు. పర్చూరు క్లబ్‌ను మూడు బెస్ట్ క్లబ్, ఉత్తమ కార్యదర్శిగా ప%శీ%బి సదానందరెడ్డి, వైబ్రంట్ క్లబ్ గాను గుర్తిస్తూ 10 ప్రశంసా పత్రాలు అందజేశారు. గవర్నర్ భూసిరెడ్డి శంకరరెడ్డి మాట్లాడుతూ క్లబ్ అధ్యక్షుడు చేసిన సేవలను కొనియాడారు. పర్చూరు క్లబ్ చేస్తున్న కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు, కాబోయే అధ్యక్షుడు తోకలకృష్ణ మోహన్ పాల్గొన్నారు.



అవార్డులు అందుకుంటున్న మార్టూరు రోటరీ ప్రతినిధులు

మార్టూరు రూరల్ : వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మార్టూరు రోటరీ ప్రతినిధులకు ప్రత్యేక పురస్కారం లభించింది. 2023-24 సంవత్సరానికి రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లూరి సాంబశివరావు, మద్దుమాల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అందించిన సేవలకు గుర్తింపు లభించింది. భద్రాచలంలో ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్ అవార్డ్స్ మహొత్సవంలో మార్టూరు రోటరీ ప్రతినిధులు అవార్డులు అందుకున్నారు. ఆంధ్రా రీజియన్ ఉత్తమ 3వ రోటరీ అధ్యక్షులుగా తాళ్లూరి సాంబశివరావు, ఉత్తమ రోటేరియన్ అవార్డు ఎఫర్ట్ సంస్థ చైర్మన్ జాష్టి వెంకట మోహనరావు, ఉత్తమ అసిస్టెంట్ గవర్నర్‌గా విశిష్ట సేవలు అందించిన ఇంటూరి ఆంజనేయులు, మొదటి ఉత్తమ ఎజి అవార్డును 3150 రోటరీ జిల్లా గవర్నర్ బూసిరెడ్డి శంకరరెడ్డి, కాన్ఫరెన్స్ అవార్డ్స్ చైర్మన్ కారే చంద్రమౌళి చేతుల మీదుగా అందుకున్నారు. ప్రజారోగ్యం, పర్యావరణం, ఆర్థికాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమం, విద్యాభివృద్ధి, ప్రపంచ శాంతిపై రోటరీ సభ్యులు అందించిన సేవలకు ప్రశంస పత్రాలు అందజేశారు. మార్టూరు రోటరీ క్లబ్‌కు అవార్డులు రావడం పట్ల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

క్రెడిట్ కార్డు నిర్వహణపై ఆర్‌బిఐ మార్గదర్శకాలు

ప్రజాశక్తి - అద్దంకి

అత్యవసర సమయాల్లో నగదు చేతిలో లేనప్పుడు క్రెడిట్ కార్డు చాలా మందికి అపద్బాంధవుడిలా ఉపయోగపడుతుంది. అంతే కాదు తక్కువ సమయంలో క్రెడిట్ స్కోర్ పెంచుకోవాలనుకుంటే క్రెడిట్ కార్డు మంచి సాధనంగా ఉపయోగపడుతుంది. బిల్లుల చెల్లింపులు, కొనుగోళ్లకు కార్డు ఉపయోగిస్తూ సకాలంలో బిల్లు చెల్లిస్తే మంచి క్రెడిట్ హిస్టరీని నిర్మించుకోవచ్చు. ఈ ఉపయోగాలు ఉండటంతో దేశంలో క్రెడిట్ కార్డు వినియోగించే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. వినియోగం పెరిగినప్పటికీ క్రెడిట్ కార్డును సరైన పద్దతిలో ఉపయోగించడంలో విఫలమౌతున్నారు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. క్రెడిట్ కార్డు అందించే సంస్థలు, బ్యాంకులు వీటి గురించి స్పష్టంగా చెప్పకపోవడం, అవగాహన రాహిత్యంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. యాడ్ - ఆన్ కార్డుల బిల్లు బాధ్యత ఎవరిది? బిల్లింగ్ సైకిల్ మార్చుకోవచ్చా? కార్డు వినియోగంలో ఇబ్బందులు ఎదురైనప్పుడు ఎవరికి ఫిర్యాదు చేయాలి? సాధరాణంగానే కార్డు ఉపయోగించే వారికి ఇలాంటి సందేహాలు వస్తుంటాయి. వాటన్నింటికీ ఆర్బీఐ సమాధానాలు ఇచ్చింది. అవేంటో తెలుసుకుందాం.

పరిమితి మించితే

పరిమితికి మించి క్రెడిట్ కార్డును ఉపయోగించుకోవచ్చా? వినియోగిస్తే ఎమవుతుందనే సందేహం ప్రధానంగా వినియోగదారుల్లో ఉత్పన్నమవుతుంది. అయితే కస్టమర్ల అనుమతితో పరిమితిని మించి వాడుకునే వ్యసులు బాటును సంస్థలు, బ్యాంకులు ఇవ్వొచ్చు. అవసరం లేదనుకుంటే దీన్ని డియాక్టివేట్ చేసుకోవచ్చు. కస్టమర్‌కు తెలియజేయకుండా మాత్రం అదనపు పరిమితిని అనుమతించడం, దానికయ్యే అదనపు ఛార్జీలు వసూలు చేయకూడదు. ఓవర్ లిమిట్ ఛార్జీలను వేసేటప్పుడు వడ్డీ వంటివి క్రెడిట్ లిమిట్ పరిధిలోకి తీసుకోవద్దని ఆర్బీఐ స్పష్టం చేసింది.

పెండింగ్ బిల్లు

ఒక క్రెడిట్ కార్డుపై యాడ్ ఆన్ కార్డులను తీసుకునే వెసులుబాటు ఉంటుంది. అలాంటప్పుడు వాటన్నింటిపై ఉన్న బిల్లు చెల్లించే బాధ్యత ప్రధాన కార్డుదారుడిదే. ఒక్క బిజినెస్ క్రెడిట్ కార్డుల విషయంలో మాత్రం బిల్లు విభజించుకునే వ్యసులుబాటు ఉంటుంది.

ఇన్సూరెన్స్ ఉంటుందా?

క్రెడిట్ కార్డుపై బీమా తప్పనిసరిగా ఇవ్వాలనే నిబంధనలేమీ లేవు. కొన్ని సంస్థలు, బ్యాంకులకు సంబంధించిన కార్డులకు బీమా వర్తింపజేసి జారీ చేస్తుంటాయి. ఇందులో నామినీ సహా బీమా వివరాలను ప్రతి స్టేట్మెంట్లో తప్పకుండా ఇవ్వాలి. పాలసీ ఇచ్చిన బీమా కంపెనీ చిరునామా పాలసీ పూర్తి వివరాలు, ఫోన్ నంబర్ అందులో పొందుపర్చాలి. ఒకవేళ గ్రూప్ ఇన్సూరెన్స్ అయితే అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ అందించాలి.

ఫిర్యాదులు ఎలా?

కార్డు జారీ చేసిన సంస్థలు, బ్యాంకుపై ఫిర్యాదు చేయాలంటే మీకు ఏర్పడిన అసౌకర్యం గురించి వాటికే కంప్లైంట్ ఇవ్వాలి. 30 రోజుల్లోగా స్పందించకపోయినా, తిరస్కరించినా, వారి స్పందనతో సంతృప్తి చెందకపోయినా కస్టమర్ ఆర్బీఐ అంబుడ్సెమెన్‌ను సంప్రదించాలి. ఆన్‌లైన్ లేదా దరఖాస్తు ఫారం ద్వారా కంప్లైంట్ ఇవ్వొచ్చు. మినిమం అమౌంట్ బిల్ కడితే మాత్రం ఇంట్రెస్ట్ ఫ్రీ గడువు పూర్తయినట్టే. మీరు ఆ నెలల్లో కార్డు ద్వారా వినియోగించే మొత్తానికి అప్పటి నుంచి బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు వడ్డీ వేస్తాయని గుర్తుంచుకోవాలి.

రిసార్ట్స్ లో ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

ప్రజాశక్తి - బాపట్ల



రూరల్ సిఐ శ్రీహరి

సూర్యలంక పర్యాటక శాఖకు చెందిన హరిత బీచ్ రిసార్ట్స్ సూర్యలంక పేరుతో తప్పుడు వెబ్ సైట్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పర్యాటకులను మోసం చేస్తున్న ముఠాపట్ల అప్రమత్తంగా ఉండాలని రూరల్ సిఐ శ్రీహరి విలేకరులకు సోమవారం తెలిపారు. కొంతమంది వ్యక్తులు ఆన్‌లైన్‌లో హరిత రిసార్ట్స్ లో రూం బుక్ చేసుకునే క్రమంలో ఈ ఫేక్ వెబ్ సైట్‌లో లాగిన్ అవుతూ వాళ్లతో వాట్సప్‌లో చాట్ చేస్తూ రూములను బుక్ చేసుకుని ఫేక్ వెబ్ సైట్‌కు లింక్ చేసిన వారి ఖాతాల్లోకి డబ్బులు చెల్లింపులు జరుపుతున్నారని అన్నారు. హరిత రిసార్ట్స్‌లో రూములు బుక్ చేసుకునేందుకు వారి ఖాతాల్లోకి డబ్బు లావాదేవీలతో పర్యాటకులను మోసం చేస్తున్నారని తెలిపారు. సూర్యలంక హరిత రిసార్ట్ మేనేజర్ జి అశోక్ ప్రాథమిక ఆధారాలతో రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. తప్పుడు వెబ్ సైట్ తయారు చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా సూర్యలంక హరిత రిసార్ట్స్‌లో రూములు ఆన్ లైన్‌లో బుక్ చేసుకోవాలనే వాళ్ళు ఆంధ్రప్రదేశ్ టూరిజం డిపార్ట్మెంట్ తరఫున నిర్వహిస్తున్న నిజమైన సైట్‌లో మాత్రమే బుక్ చేసుకోవాలని సిఐ శ్రీహరి తెలిపారు. పర్యాటక శాఖకు చెందిన సూర్యలంక బీచ్‌లో రిసార్ట్ బుక్ చేసుకునే పర్యాటకులు ఆన్ లైన్ లావాదేవీలు చేసే క్రమంలో మీరు ఆపరేట్ చేస్తున్న వెబ్ సైట్ అసలైందా, నకిలీదా అని ముందుగా నిర్ధారించుకొని ఆ వెబ్ సైట్‌లో మీ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. తొందరపాటు నిర్ణయాలతో మోసగాళ్ళకు డబ్బులు చెల్లించి మోసపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.



సూర్యలంక పర్యాటక శాఖకు చెందిన హరిత బీచ్ రిసార్ట్స్

యర్రం పోలిరెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలి

మంత్రి గొట్టిపాటికి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి - మేదరమెట్ల

మండలంలోని కొరిసపాడు గ్రామంలో నిర్మాణంలో ఉన్న యర్రం పోలిరెడ్డి ఎత్తిపోతల పథకం పనులు పునః ప్రారంభించి వెంటనే పూర్తి చేయాలని రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మాత్యులు గొట్టిపాటి రవికుమార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. 2008లో రూ.177కోట్లతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిన్న పోలిరెడ్డి ఎత్తి పోతల పథకాన్ని ప్రారంభించారని వినతి పత్రంలో పేర్కొ న్నారు. కొంత పనులు చేసిన తర్వాత పనులు నిలిచి పోయి పూర్తి కాలేదని తెలిపారు. మూడు ప్రభుత్వాలు మారినప్పటికీ పథక పరిస్థితి అలానే ఉందని తెలిపారు. ఈ పథకం పూర్తయితే మూడు మండలాలకు సాగునీరు, తాగునీరు అందుతుందని పేర్కొన్నారు. వెంటనే కలుగ చేసుకుని ఎతి పోతల పథకాన్ని త్వరగా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతు నాయకులు కోరారు. మంత్రిని కలిసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం ఆంజనేయులు, రైతు సంఘం బాధ్యులు నాతాని హనుమంతరావు, సేవ కోటేశ్వరరావు, నందికోలు సుబ్బారావు, కంచర్ల సుబ్బారావు, వై రవిబాబు, నక్కల అంజయ్య ఉన్నారు.

డ్రోన్ల వినియోగంపై ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఇంకొల్లు, గొల్లపాలెం రోడ్డులోని మారుతి ఐటిఐ కాలేజీ నందు వ్యవసాయంలో డ్రోన్ల వాడకంపై స్వల్పకాలిక వ్యవధిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ప్రధాన మంత్రి కౌశిక్ యోజన విశాల్ పథకంలో భాగంగా రాష్ట్రంలో వ్యవసాయంలో సాంకేతికత అభివృద్ధి చేసేందు కు కేంద్ర ప్రభుత్వం ఈ కోర్సును ఈ ఏడాది నూతనంగా ప్రవేశపెట్టింది. అందులో భాగంగా ఇంకొల్లు మారుతి ఐటిఐ కాలేజీకి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. నెల రోజులపాటు శిక్షణ ఇచ్చే ఈ కోర్సుకు 10వ తరగతి చదివిన 18 నుండి 45ఏళ్లలోపు వారు అర్హులు కాలేజీ ప్రిన్సిపాల్ కె శ్రీనివాసరావు తెలిపారు. డ్రోన్ల వాడకంతో రైతు మిత్రులకు సమయం ఆదా అవ్వటమే కాకుండా పురుగు మందులు, బలం మందులు తక్కువ నీటితో సమపాళ్లలో పైర్లపై పిచకారీ చేయవచ్చని తెలిపారు. దీని వలన మంచి ఫలితం ఉంటుందని తెలిపారు. నెల రోజుల శిక్షణ పూర్తియిన అనంతరం కోర్సు పూర్తి చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ ట్ సర్టిఫికెట్ మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 24 నుండి కాలేజీలో కోర్సు ప్రారంభం కానుందని తెలిపారు. కోర్సులో చేరే యువకులు 10వ తరగతి అర్హత సర్టిఫికెట్‌తో పాటు రెండు పాస్పోర్ట్ సైజు ఫోటోలు, ఆధార్ కార్డు తీసుకొని నాలుగు రోజుల్లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. కోర్సు శిక్షణ సర్టిఫికెట్ పొందిన యువకులు, రైతులకు ప్రభుత్వం రాయితీపై రుణాలు మంజూరు చేస్తుందని తెలిపారు.

మార్టూరులో భానుడి భగ భగలు

బక్రీద్ రోజున నిర్మానుష్యంగా రహదారులు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

మండలంలో భానుడు నిప్పులు చెరిగాడు. వర్షాకాలం మొదలైన రోజు రోజుకి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అడపా దడపా చిరుజల్లులు కురుస్తున్నా ఎండ తీవ్రతతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బక్రీద్ పండగ రోజున సోమవారం వీచిన వడగాలులకు ప్రజలు విలవిల లాడిపోయారు. ప్రధాన రహదారులు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారింది. వాహనాల రాకపోకలు తగ్గాయి. వాతావరణంలో తేమ శాతం తగ్గిపోవడం, వేడి గాలులు విపరీతంగా పెరిగాయి. ఉదయం నుండే వీస్తున్న వడగాలులను సైతం లెక్కచేయకుండా ముస్లీమ్ సోదరులు మండలంలోని ఈద్గాల వద్ద బక్రీద్ పండగ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నిత్యం రద్దీగా ఉండే గన్నవరం రోడ్డులో జనసంచారమే లేకపోవడంతో బేరాలు లేక వ్యాపారులు దుకాణాలు మూసేశారు. అత్యవసర పనుల నిమిత్తం బయటకు రావాలంటే తగు జాగ్రత్తలతో పనులు ముగించుకుని ఇళ్లకు చేరుతున్నారు. శీతల పానీయాలు, పండ్ల రసాలతో ప్రజలు సేదతీరుతున్నారు.

తైక్వాండో క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి - చీరాల

ఒరిస్సాలోని కటక్ జవహర్లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఈనెల 28, 29, 30 తేదీల్లో జరిగే నేషనల్ టైక్వాండో పోటీలకు ఏపి నుండి ఎంపికైన హంటర్స్ తైక్వాండో విద్యార్థులు స్థానిక శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్యను సోమవారం కలిశారు. ఆయన చేతుల మీదుగా రాష్ట్రస్థాయిలో వారికి వచ్చిన సర్టిఫికెట్స్‌ను, బంగారు పతకాలను తీసుకున్నారు. విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ తరపున ఎన్నికైన అందరికీ అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో కూడా తప్పకుండా మెడల్స్ సాధించాలని కోరారు. ఆటల్లోనే కాకుండా చదువులో కూడా రాణించాలని ఆకాంక్షించారు. వారికి మంచి తర్ఫీదు ఇచ్చిన కోచ్ గూడూరు శాంతి వరప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. శాలువాతో సత్కరించారు. కోచ్ గూడూరు శాంతి వరప్రసాద్ మాట్లాడుతూ పెద్దల ప్రోత్సాహం ఆశీస్సులు ఉంటే తప్పకుండా నేషనల్ మెడల్ సాధిస్తామని తెలిపారు. తమకు ఇంతటి ప్రోత్సాహాన్ని ఇచ్చిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. టైక్వాండో ట్రెనింగ్ స్కూల్ తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

వెంకటేష్ కాలుకు ముంబాయిలో శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - చీరాల

వైసిపి ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ మోకాలుకు ముంబాయిలో సోమవారం మరో సారి ఆపరేషన్ చేశారు. ఎన్నికలకు ముందు బోయినవారిపాలెం రైల్వే గేటు వద్ద ద్విచక్ర వాహనంపై వెళుతూ ప్రమాదానికి గురయ్యారు. అప్పట్లో కాలికి గాయం కావడంతో హైదరాబాదులో సర్జరీ చేశారు. సుమారు ఐదు నెలలు విశ్రాంతి తీసుకున్నారు. ఆ తర్వాత ఎన్నికల్లో విస్తృతంగా పర్యటించారు. ఈనేపధ్యంలో చేసిన సర్జరీతో పూర్తిగా నయం కాకపోవడంతో ఎన్నికల అనంతరం వైద్యుల సూచన మేరకు మరోసారి ముంబాయిలోని హిందుజా హాస్పిటల్‌లో ఆపరేషన్ చేశారు.



వైసిపి ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్



గాయపడిన వాలంటీర్లను పరామర్శిస్తున్న అశోక్ బాబు

వాలంటీరుపై దాడి హేయమైన చర్య

ప్రజాశక్తి - వేమూరు

మండలంలోని చంపాడు గ్రామానికి చెందిన మాజీ వాలంటీరు పమిడిపాముల జ్యోతిపై టిడిపి కార్యకర్తలు దాడి చేసి గాయపరచటం హేయమైన చర్యని వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు అన్నారు. జ్యోతి వైసిపికి అనుకూలంగా పనిచేసిందనే నెపంతో టిడిపి కార్యకర్తలు మహిళని కూడా చూడకుండా దాడి చేసి గాయపర్చడం టిడిపి అరాచకాలకు అద్దం పడుతుందని అన్నారు. దాడి సమాచారం తెలుసుకున్న ఆయన వైద్యశాల్లో ఉన్న జ్యోతిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి తక్షణమే విందుతులపై కేసు నమోదు చేయాలని పిర్యాదు చేయించారు. గాయపడిన ఆమెకు వైసిపి అండగా ఉంటుందని చెప్పారు. ఎన్నికల్లో ప్రజలు టిడిపికి పూర్తి మద్దతుని ఇచ్చారని, గెలుపొంది ప్రజలకు అన్ని విధాలుగా సేవ చేయాలి తప్ప కక్ష సాధింపు చర్యగా దాడులకు పాల్పడటం సరికాదన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు సైతం దాడులకు భయపడా ల్సిన పనిలేదని అన్నారు. తాను నియోజకవర్గంలోనే కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వైసిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపించాలని చూస్తే సహించేది లేదని అన్నారు. ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. వైసిపి ఓడిపోయింది తప్ప చచ్చిపోలేదనే విషయాన్ని గుర్తించు కోవాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎంఇఒ సుధాకరరావు

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - అద్దంకి

ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో స్థానిక సత్రంబడి ఆవరణలో భవిత కేంద్ర పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఇట్టా రామారావు అధ్యక్షతన "నేను బడికిపోతా" 4వ రోజు ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులకు అవగాహన సోమవారం కల్పించారు. ఎంఇఒలు బి సుధాకరరావు, డి గంగాధరరావు మాట్లా డుతూ వైకల్యంగల విద్యార్థులకు ప్రభుత్వం అనేక సౌక ర్యాలు కల్పించిందని తెలిపారు. ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో భవిత కేంద్రాలను నిర్వహిస్తుందని తెలిపారు. సాధారణ విద్యార్థులతో సమానంగా చూడా లని చెప్పారు. భవిత కేంద్రానికి రాలేని పిల్లలకు ప్రతి శనివారం ఇంటివద్దనే విద్య అందించడం, ప్రతి సోమ వారం ఉచితంగా ఫిజియో థెరపీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వీరికి ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా ప్రత్యేక అలవెన్స్ అందిస్తుందని తెలిపారు. గంగాధరరావు మాట్లాడుతూ ప్రత్యేకంగా వైకల్యం కారణంగా ఏ పిల్ల వాడు కూడా బడి మానివేయకుండా బడి బయట ఉండ కూడదనే లక్ష్యంతో ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పా టు చేసిందని తెలిపారు. అందులో పనిచేస్తున్న ఐఈఆర్టీ ఉపాధ్యాయుల సేవలను తల్లిదండ్రులు తప్పకుండా వినియోగించుకోవాలని తెలిపారు. బొమ్మనంపాడు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ తల్లిదండ్రులు భవిత కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సదరం సర్టిఫికెట్ విషయంలో ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలని తెలిపారు. చక్రాయపాలెం ఉన్నత పాఠశాల హెచ్ఎం కెవి శ్రీనివా సరావు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థు లకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె బాబురావు, ఐఈఆర్టీ ఉపాధ్యాయులు కొంగల శ్రీనివాసు, పాలపర్తి యోనా, సిఆర్పి గురవయ్య, ఆయా లక్ష్మీ పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి పైన సోమ వారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం చీరాల ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో నివాసం ఉంటు న్న ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ ఆరోబి పైన డివైడర్ ఢీ కొన్నాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయా లయ్యి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. విషయం గమ నించిన స్థానికులు వెంటనే 108వాహనంకు సమా చారం అందించారు. 108సిబ్బంది చికిత్స నిమిత్తం యువ కుడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం ఆ యువకుడు పరిస్థితి విషమంగా ఉండడంతో బంధు వులు ఏరియా వైద్యశాల నుండి ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.



దస్త్రాలను పరిశీలిస్తున్న ఆడిటర్లు

వెలుగు కార్యాలయంలో రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక స్త్రీ శక్తి భవనంలోని వెలుగు కార్యాలయంలో ఆడిటర్లు దస్త్రాలను వార్షిక పరిశీలన సోమవారం చేశారు. మానేపల్లి అసోసియేట్స్ ఆధ్వర్యంలో మండలంలోని 39 గ్రామ సంఘాల దస్త్రాలు పరిశీలించినట్లు ఆడిటర్లు శ్రీకాంత్, జవర్ధనాయక్ తెలిపారు. హెడ్డింగ్ దస్త్రాలు కచ్చితంగా నిర్వహించాలని చెప్పారు. అందులో తప్పులు దిద్దుట, కొట్టివేతలు ఉండ కూడదని సిబ్బందికి సూచించారు. 2023 -2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన దస్త్రాలు పరిశీలించిన అనంతరం సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపిఎం మోహనరావు, సిసిలు విజయకుమార్, రాజశేఖర్, అంజిరెడ్డి, డిఎంజి శ్రీనివాసరావు, విఒఎలు పాల్గొన్నారు.



వేలంగిని మాత దర్శనంలో నాయకులు

వేళంగి మాతను దర్శించుకున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - సంతమాగులూరు

అద్దంకి ఎమ్మెల్యేగా, విద్యుత్ శాఖ మంత్రిగా గొట్టిపాటి రవికుమార్ పదవీ బాధ్యతలు చేపట్టడంతో తెలుగుదేశం మండల ప్రధాన కార్యదర్శి అనంతవరపు దేవా, అతని మిత్ర బృందం తమిళనాడులోని వేళంగి మాత దేవాలయా న్ని సోమవారం సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. తమ మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు దేవాకు అభినందనలు తెలిపారు.

23న మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పంగులూరు

జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర్ నేత్రాలయ సహకారంతో ఈ నెల 23న ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మెగా కంటి శుక్లాల వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ క్యాంప్ ఇంచార్జి చిలుకూరి వీరరాఘవయ్య సోమవారం తెలిపారు. స్థానిక రోటరీ కార్యాలయ భవనం దగ్గర ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని తెలిపారు. శిబిరంలో పరీక్షలకు వచ్చేవాళ్లు ఆధార్, ఆరోగ్యశ్రీ, లేదా ఓటర్ గుర్తింపు కార్డు జిరాక్సులను తీసుక రావాలని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అన్న దానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

త్వరలో అన్న క్యాంటీన్లు ప్రారంభం

ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని అన్న క్యాంటీన్లను త్వరలో ప్రారంభిస్తామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలిపారు. అబ్బూరి వెంకట్రావు మిత్రబృందం ఆధ్వర్యంలో స్థానిక కర్నూల్ రోడ్డులోని అన్నా క్యాంటీన్, కొత్తపట్నం బస్టాండ్ క్యాంటీన్, హోటల్ కోలాస్ ఎదురుగా ఉన్న అన్నా క్యాంటీన్, కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్ల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దామచర్ల సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 24వ డివిజన్‌లోని తెలుగు మహిళలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావుకు ఘన స్వాగతం పలికారు. అనంతరం దామచర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ పేదలకు ఐదు రూపాయలకే కడుపు నిండా భోజనం పెట్టాలనే ఉద్దేశంతో ఆనాడు నందమూరి తారక రామారావు పేరుతో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశారన్నారు. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూసివేసి పేదల పొట్టలు కొట్టిందని ఆరోపించారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం అనంతరం ఐదు సంతకాల్లో అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు సంతకం చేశారని, వాటిని త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం రాత్రి భోజనం రూ.15 అందించే విధంగా ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యామన్నారు. అబ్బూరు వెంకట్రావు మిత్ర బందం దాదాపు పదివేల మందికి నాలుగు ప్రాంతాలలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, కార్పొరేటర్ మస్తానమ్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, దమ్మాలపాటి పాపారావు. కొండయ్య నాయుడు, కాకర్ల వెంకట సుబ్బారావు, త్రివేణి, నామినేని రాఘవ, వాయల మల్లికార్జునరావు, అనంతమ్మ, 29వ డివిజన్ అధ్యక్షుడు పెద్దిశెట్టి చంద్ర, తెలుగునాడు అంగన్‌వాడీ యూనియన్ సహాయ కార్యదర్శి పి. వరలక్ష్మి పాల్గొన్నారు.

మంత్రి స్వామిని కలిసిన ఎస్‌పి

ప్రజాశక్తి- టంగుటూరు

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయులు స్వామిని జిల్లా ఎస్‌పి సుమిత్‌గరుడ తూర్పు నాయుడుపాలెంలోని మంత్రి నివాసంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

మంత్రి స్వామికి సన్మానం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిని జనసేన పార్టీ శింగరాయకొండ మండల అధ్యక్షుడు ఐనాబత్తిన రాజేష్ మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కాసుల శ్రీనివాస్, కార్యదర్శులు అనుమశెట్టి కిరణ్ బాబు, గుంటుపల్లి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి తగరం రాజు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి స్వామిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు



బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

జరుగుమల్లి మండలం లోని దావగూడూరు గ్రామంలోని శ్రీ చెన్న కేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 18 నుంచి 26 వరకు నిర్వహించనున్నారు. అందులో భాగంగా బ్రహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ, సచివాలయ, విలేజ్ వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తూర్పునాయుడు పాలెంలోని తన నివాస గృహంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దావగూడూరు గ్రామ మాజీ సర్పంచి చదలవాడ బ్రహ్మేంద్రం, ఆలయ ఇఒ డి. రజనీ కుమారి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బత్తిన బ్రహ్మయ్య, టిడిపి నాయకులు దామచర్ల శ్రీనివాసరావు, కొరిమెళ్ళ శ్రీనివాసరావు, కొరిమెళ్ళ వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి 'శిద్దా' రాజీనామా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



వైసిపికి ఎదురు దెబ్బ తగిలింది. మాజీ మంత్రి. వైసిపి రాష్ట్ర నాయకులు శిద్దా రాఘవరావు ఆ పార్టీకి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు వైసిపి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి రాజీనామా లేఖను పంపారు. మరో రెండురోజులలో తన అనుచరులు, నాయకులు, కార్యకర్తలతో చర్చించి రాజకీయ నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. శిద్దా రాఘవరావు భారతీయ జనతా పార్టీలో చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఆప్తమిత్రుడిని కలిసిన ఎమ్మెల్యే 'కన్నా'

ప్రజాశక్తి -మద్దిపాడు

సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తన ఆప్త మిత్రుడిని సోమవారం కలిశారు. తిరుపతి దైవ దర్శనానికి వెళ్లి వస్తూ మద్దిపాడులోని తన ఆప్త మిత్రుడు జన్నాభట్ల శ్రీనివాసరావు (వీరభద్ర హోటల్ పంతులు)ను వారి గహంలో కలిసి ఆప్యాయంగా పలకరించారు. వారి కుటుంబ క్షేమ సమాచారం తెలుసుకొని, వారిచ్చిన తేనేటి విందుని స్వీకరించారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణను మద్దిపాడు గ్రామ టిడిపి అధ్యక్షులు కడియాల రఘుబాబు, బీసీ నాయకులు శుద్ధపల్లి అనిల్, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు రెబ్బవరపు ప్రభాకర్ రావు, వేల్పుల నాగరాజు, శుద్ధపల్లి నరసింహారావు, వెల్లంపల్లి సర్పంచి అనిల్, పాటిబండ్ల చెంచయ్య, ఎంద్రపాటి బుల్లి, నూనె వెంకటేశ్వర్లు కలిసి శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.



ఎమ్మెల్యే కన్నాతో టిడిపి నాయకులు

కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటాలు

సిఐటియు జిల్లా నాయకురాలు పి.కల్పన

ప్రజాశక్తి-కొత్తపట్నం

కార్మికులు, ఉద్యోగుల హక్కులు, జీవన ప్రమాణాల పెంపు కోసం సిఐటియు నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా నాయకురాలు పి.కల్పన తెలిపారు. సిఐటియు మండల ద్వితీయ మహాసభ స్థానిక శ్రీవాణి స్కూల్‌లో ఎ.పద్మ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంపదలను కార్పొరేటర్లకు ధారా దత్తం చేస్తూ, కార్మికుల హక్కులను కాలరాస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఐక్య ఉద్యమాలు, ఐక్య పోరాటాల ద్వారా సిఐటియు ప్రతిఘటిస్తున్నట్లు తెలిపారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న కార్మికులకు సిఐటియు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తు లోనూ కార్మికులు, ఉద్యోగుల హక్కులు, జీవన ప్రమాణాల పెంపు కోస పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఆధ్వర్యంలో సమ్మెలు, పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజనపథకం, పంచాయతీ, భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించి విజయాలు సాధించినట్లు తెలిపారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ హక్కుల సాధన కోసం కార్మిలందరూ ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం సిఐటియు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా ఎస్. సోమిరెడ్డి, అధ్యక్షుడిగా పి. సోమరాజు, కమిటీ సభ్యులుగా 15 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో అంగన్ వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి. కల్పన